క్లుప్తంగా

సేవ చేస్తే మనిషి జన్మ సార్థకం



సేవాకార్యక్రమాలు చేస్తున్న వారిని సత్కరిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి

అగనంపూడి: మానవ జాతికి సేవ చేయడంలో ఉన్న ఆనందం, అనుభూతి చెప్పలేనిది.. అటువంటి వారి జన్మ సార్థకం అవుతుందని బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి అన్నారు. సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బీకే రామ్‌కుమార్ (రాము), భరత్ లక్ష్మణ్‌కుమార్, వీఎస్ రాజు, మెట్రోఫార్మా హెచ్‌ఆర్ ఇన్‌చార్జి జె.శ్రీనివాసరావులను శుక్రవారం అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం)లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవజన్మ పవిత్రమైందని, దాన్ని ఫలప్రదం చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ ఎంతోకొంత సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అగనంపూడి సంస్థ ఇన్‌చార్జి బీకే రామకోటి, ప్రజా సంఘాల ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, వసుధా ఫార్మా సంస్థ ప్రతినిధి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

యారాడ పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడ్



శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై చిత్రలేఖన, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి యారాడ గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కోవాలని సూచించారు. సామాజిక దూరం పాటించడం, మరుగుదొడ్ల వినియోగం, మంచినీరు పొదుపుగా వాడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు జీఎం సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీల్లోని ఐదు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం ఇతర వంటసామగ్రి, నిత్యావసర సరకులు అందించారు. కొండయ్యవలస, పినమడక, బీసీ కాలనీ, కొత్తూరుల్లోని వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు భూషి చిట్టిబాబు సమకూర్చిన సరకులను ఐదు కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, కర్రి రామారావు, దాసరి రాజు, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట: 'స్వచ్ఛతా హీ సేవా – 2025' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన స్వచ్ఛోత్సవ్ పోస్టర్లను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17న ప్రారంభమై అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. వీటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలుష్య కౌగిలి!



పోర్టు రోడ్‌లో రేగుతున్న ధూళి



రోడ్డుపై రాలి పడుతున్న పారిశ్రామిక మెటీరియల్

- పారిశ్రామిక నగర వాసుల ఉక్కిరిబిక్కిరి
- పొగ, దుమ్ము, ధూళితో అవస్థలు
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఏటా 33 వేల మంది వాయు కాలుష్యానికి బలవుతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి.

వాయుకాలుష్యం కారణంగా ఒక్క ఢిల్లీలోనే ఏటా 12వేల మంది మరణిస్తున్నారని అంచనా. ఇక్కడ ప్రతీ పదిమందిలో ఒకరు శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నట్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

విశాఖపట్నంలో కూడా కాలుష్య స్థాయి సాధారణం కంటే ఐదు రెట్లు అధికంగా ఉందని 1983లోనే ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు పేర్కొన్నారు.

విశాఖ నగరానికి సమీపాన ఉన్న గాజువాకలో పరిస్థితి కూడా ఈ నగరాలకు ఏ మాత్రం తీసిపోదు. – గాజువాక

పొగగొట్టాల భగభగలు.. యంత్రభూతాలతో నిండిన ఫ్యాక్టరీల సైరన్ కూతలు.. వాహనాల పరుగులు.. జీవనం గడపడానికి పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు వచ్చిన జనసముదాయం.. ఇవన్నీ గాజువాకలో సరికొత్త వాతావరణం సృష్టించాయి. ఈ కారణంగా స్వచ్ఛతకు ఆమడ దూరాన, కాలుష్యపూరిత వాతావరణంలో బతుకు గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. నియంత్రణ లేని పారిశ్రామిక కాలుష్యం గాజువాకను క్రమక్రమంగా కబళిస్తోంది. వివిధ కర్మాగారాల నుంచి వెలువడుతున్న కాలుష్య మేఘాలు అటు విశాఖనగరంతో పాటు ఇటు గాజువాకపై కూడా కమ్ముకుంటున్నాయి. సముద్రతీర పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యకారక వాయువులు భూమి నుంచి సముద్రంపైకి, అక్కడి నుంచి తిరిగి భూమిపైకి ప్రసరించే గాల్లో మిళితమై ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్నాయని అనేక అధ్యయనాల్లో తేలింది. పైగా ఇక్కడ పరిశ్రమల చుట్టూ ఎత్తయిన కొండ లున్నాయి. ఫలితంగా వాతావరణంలో గాలి ఎక్కువగా స్తబ్దంగా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో రాత్రివేళల్లో పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ము, ధూళి, ఇతర రసాయనాలు భూమి ఉపరితలంపైనే కేంద్రీకృతమై ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నట్టు పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.



దుమ్ముతో, ధూళితో నిండిపోయిన రోడ్డు

కానరాని నియంత్రణ చర్యలు

గాజువాక కాలుష్యం బారిన పడినట్లు 1983 నాటికే ఒక పరిశోధన ద్వారా స్పష్టమైంది. అయినప్పటికీ కాలుష్యంపై ఎటువంటి నియంత్రణలేదు. ఫలితంగా వాతావరణ కాలుష్యం మరింత తీవ్రస్థాయికి చేరింది. వివిధ పరిశ్రమలు, రసాయన పరిశ్రమల నుంచి నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ ఆక్సైడ్లు, హైడ్రోకార్బన్లు, హైడ్రోజన్ సల్ఫయిడ్ వంటి కాలుష్య కారక పదార్థాలు వెలువడుతున్నట్టు వివిధ సర్వేలను బట్టి తెలుస్తోంది.

వ్యాధులతో ఉక్కిరిబిక్కిరి

గాజువాక చుట్టు పక్కల వెలువడుతున్న పారిశ్రామిక కాలుష్యం కారణంగా ఇక్కడి పారిశ్రామిక వాడల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. కళ్ల మంటలు, ముక్కు దిబ్బడ, జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, శ్వాస సరిగ్గా ఆడకపోవడం, గుండెదడ, కండరాల నొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, క్షయ, ఉబ్బసం, అలర్జీ, చర్మ వ్యాధులు, క్యాన్సర్ తదితర వ్యాధులతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు ఈ కాలుష్యం బారిన పడి తీవ్ర దుష్పరిణామాలకు లోనవుతున్నారు. చుక్కవానిపాలెం, మింది, ములగాడ, గంగవరం తదితర గ్రామాల్లో పరిస్థితి మరింత దిగజారింది. పరిశ్రమలు వాయు కాలుష్యాన్ని మాత్రమే కాకుండా జల కాలుష్యానికి కూడా కారణమవుతున్నాయి. పారిశ్రామిక వ్యర్థ పదార్థాలను నేరుగా వదలడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. హెచ్‌పీసీఎల్, కోరమాండల్, స్టీల్‌ప్లాంట్ తదితర పరిశ్రమల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు గృహ వినియోగానికి ఏమాత్రం పనికిరావని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు విచక్షణా రహితంగా వ్యర్థ పదార్థాలను భూగర్భంలోకి పంపించడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైందని అంటున్నారు. తీవ్రంగా కాలుష్యం బారినపడ్డ గాజువాక పరిసరాల పరిరక్షణకు కాలుష్య నియంత్రణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సి ఉంది. జల కాలుష్య నియంత్రణ చట్టం–1974, 1977లను, వాయు కాలుష్య నియంత్రణ చట్టం–1981ని, పర్యావరణ కాలుష్య నియంత్రణా చట్టం–1986లను పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాలుష్య నివారణకు తక్షణ చర్యలు తీసుకోకపోతే గాజువాక భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రోగాలబారిన పడుతున్నాం



దుమ్ము, ధూళి మా ఇళ్లపైకి దారుణంగా వస్తోంది. పోర్టును ఆనుకొని ఉన్న పెదగంట్యాడ మండల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చిన్నపిల్లలు సైతం అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఇంకా ఇక్కడ అనేక కాలుష్య కారక పరిశ్రమలున్నాయి. వాటవల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– నక్క రమణ, పెదగంట్యాడ

అధికారులు స్పందించాలి



పోర్టు రోడ్‌లో పారిశ్రామిక మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న భారీ లారీల కారణంగా చాలా కాలుష్యం వస్తోంది. ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులందరికీ వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నాం. ప్రభుత్వాలు మారుతున్నా మా సమస్య మాత్రం అలాగే ఉంది. వాహనాలు వెళ్లేటప్పుడు కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు.

– ఇందల వెంకటేష్, పాతకర్ణవానిపాలెం



గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ఇదే తీరు

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నా



సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: స్థానిక ప్రజలకు హాని కలిగించే అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని (సిమెంట్ గ్రైండింగ్ యూనిట్) ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని సర్వే నెంబర్లు 97పి, 98 పి, 99 పి, 101లోని ప్రభుత్వ భూమి సుమారు 20 ఎకరాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకులు ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న అదానీ గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్, డంపింగ్ యార్డ్ వల్ల కాలుష్య సమస్యలతో ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే తద్వార ఎగిసిపడే ధూళి, కాలుష్యంతో పరిసర ప్రాంతంలోని ఏడు వార్డుల ప్రజలకు మరిన్ని ఆరోగ్యసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. వనజాక్షి, జి. ఆనంద్, పల్లేటి పోలయ్య, కె. అచ్యుతరావు, దుర్గారావు, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో నిరంతర సేవలు కొనసాగించాలి



ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ సారంగికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పెదగంట్యాడ హెల్త్ సెంటర్‌లో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. యూనియన్ ప్రధానకార్యదర్శి డి.వి. రమణారెడ్డి నేతృత్వంలో నాయకులు శుక్రవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ సారంగిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు హెల్త్ సెంటర్‌లో అత్యవసర చికిత్స కోసం 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారన్నారు. అయితే ఈనెల 22 నుంచి కేవలం జనరల్ షిఫ్ట్‌లో మాత్రమే వైద్యులు అందుబాటులో ఉంటారని సర్క్యులర్ విడుదల చేయడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. ఆ ఉత్తర్వులు అమలైతే మిగిలిన 16 గంటలు ఈ ప్రాంతంలోని అత్యవసర సేవలకు రోగుల ఇబ్బందులు పడతారన్నారు. అదే విధంగా రాత్రి వేళ అంబులెన్స్ సర్వీసు కీలకమన్నారు. ఆ ప్రాంతంలో ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయాన్ని విరమించుకుని నిరంతర సేవలు అందేలా వైద్యులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె. దాలినాయుడు, నిర్వాహక అధ్యక్షుడు పేర్ల నూకరాజు, కోశాధికారి నల్ల శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యక్షుడు దామూర్తి అప్పలరాజు, ఉప ప్రధానకార్యదర్శి నమ్మి ప్రసాద్, కారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



మతిస్థిమితం లేని మహిళను జీపులో తరలిస్తున్న పోలీసులు

ఉక్కునగరం: మతిస్థిమితం లేని మహిళకు పోలీసులు ఆశ్రయం కల్పించారు. స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ మాజీ డైరెక్టర్, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి కాసా పదద్మరాజు గురువారం రాత్రి ఉక్కునగరం నుంచి అగనంపూడి వెళ్తున్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలోని మర్రి చెట్టు వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన మతిస్థితిమితం లేని ఫొటోలను పట్టుకుని ఏదో మాట్లాడుకుంటుంది. ఇది చూసిన పద్మరాజు వెంటనే ఆమె ఫొటో, వీడియో తీసి స్టీల్‌ప్లాంట్ సీఐ, దువ్వాడ సీఐ, నగర పోలీస్ కమిషనర్‌లకు పంపారు. ఈ విషయంపై స్పందించిన సీపీ శంఖబ్రతబాగ్చి వెంటనే మహిళా కానిస్టేబుల్‌తోపాటు మరో కానిస్టేబుల్‌ను జీపులో పంపారు. వారు ఆమెకు భోజనం అందించారు. అనంతరం ఆ మహిళను నగరంలోని రెస్క్యూ హోంకు తరలించారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన పోలీస్ కమిషర్ బాగ్చికి పద్మరాజుతో పాటు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పలువురు అభినందనలు తెలిపారు.

శిక్షణ, ఉపాధి పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: వృత్తి విద్యలో శిక్షణ పొందిన వారు ఉపాధి పొందాలని ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు అన్నారు. పవర్ గ్రిడ్ సీఎస్సార్ కింద పవర్ సెక్టార్ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కేంద్రంలో జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సు పూర్తి చేసుకున్న వారితో పాటు ఉపాధి పొందిన 17 మందికి శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోయేలా పవర్ గ్రిడ్ అధికారులు కృషి చేయాలని సూచించారు. పవర్ గ్రిడ్ ఏజీఎం, సీఎస్సార్ శిక్షణ నోడల్ అధికారి చంద్రసేన్, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సందడి



థియేటర్‌వద్ద సందడి చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

గాజువాక: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాల్యంపై బీజేపీ కార్యకర్త ఒకరు నిర్మించిన లఘుచిత్రాన్ని స్థానిక సీఎంఆర్ ఐనాక్స్ థియేటర్‌లో శుక్రవారం ప్రదర్శించారు. ఛలో జీతేహై పేరుతో నిర్మించిన ఈ చిత్రాన్ని చూడటానికి థియేటర్‌కు చేరుకున్న ఆ పార్టీ కార్యకర్తలు సందడి చేశారు. నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, దీనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ మోదీ బాల్యంపై ఒక కార్యకర్త 20 నిమిషాల నిడివిగల లఘుచిత్రాన్ని అద్భుతంగా నిర్మించారని ప్రశంసించారు.

ఎంపీ దృష్టికి భెల్ కార్మికుల సమస్యలు



ఎంపీ భరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

గాజువాక: స్థానిక భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌లో కార్మికుల సమస్యలను ఆ సంస్థ గుర్తింపు యూనియన్, యునైటెడ్ ఫ్రంట్ నాయకులు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌అండ్ టీ సిరీస్ కార్మికుల పీఎఫ్, డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్యను ఎంపీకి వివరించారు. రిటైరవుతున్న కార్మికులకు పెన్షన్ రాని పరిస్థితి ఉందని, హయ్యర్ పెన్షన్ సమస్య కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో యూనియన్ నాయకులు సుభాకర్ సాహు, బొండా బాబూరావు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, బి.రవీంద్ర బాబు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

2 వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలి



బాపూజీనగర్ యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యం, క్యాన్సర్ పరీక్షలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగించాలని, మాతా శిశు సేవలు, గర్భిణులకు వైద్య సేవలు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయనతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



వడ్లపూడి రహదారిపై నిలిపిన వాహనాలు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కూర్మన్నపాలెం: అసలే గతుకుల రోడ్లు.. దానికి తోడు ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో సమయం, సందర్భం లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా వాహనచోదకులు నానాఅవస్థలు పడుతున్నారు. ఇది వడ్లపూడి ప్రధానరహదారిపై ప్రతిరోజూ ఎదురవుతున్న పరిస్థితి. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిత్యం రద్దీ

జాతీయరహదారి నుంచి ఆటోనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. సాధారణ ప్రజానీకంతో పాటు ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు అనునిత్యం తిరుగుతూనే ఉంటారు. అయితే ఆ రహదారిపై కొన్ని వ్యాపార సంస్థలు పార్కింగ్ ఏర్పాటు చేసుకోకపోవడంతో అక్కడికి వచ్చేవారు రహదారిపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. అవి కూడా ఇష్టానుసారంగా రోడ్డుపై నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ రహదారి గుండా ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ప్రధానంగా పవన్ సాయి ఆస్పత్రి సమీపంలో.. ఆ పక్కనే ఉన్న కిరాణా, ఇతర దుకాణాల వద్ద పరిస్థితి మరీ ఇబ్బందిగా మారింది. ఒకవైపు వాహనాలు పార్కింగ్ చేసేయడం .. మరోపక్క రోడ్డు అంతా గతుకులమయమై రాళ్లు తేలిపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందో అని భయంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్ విషయంలో తగినచర్యలు తీసుకోవాలని వడ్లపూడి వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రధానరహదారిపై వాహనాల నిలిపివేతపై చర్యలు తీసుకుంటాం. షాపుల యజమానులతో మాట్లాడుతాం. పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తాం. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

కె.వెంకటరావు, ట్రాఫిక్ సీఐ దువ్వాడ

బృందంగా పనిచేస్తే ఎన్ఐఆర్ఎఫ్‌లో మంచి ర్యాంక్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అందరూ సమిష్టిగా బృందంగా పనిచేస్తే భవిష్యత్‌లో మెరుగైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ సాధించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వవిద్యాలయం వరకు ఒక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న దానికంటే మెరుగైన ర్యాంకు సాధించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు. ఏయూ అవుట్ రీచ్ డీన్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ అందించే సమయంలో పరిగణనలోకి తీసుకునే అంశాలను వివరించారు. విదేశీ ఆచార్యులను స్వాగతించడం, పరిశోధనల్లో ప్రగతి ఎంతో ప్రధానమని తెలియజేశారు.